క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం అందిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు సచివాలయం -8 పరిధి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసముంటున్న ఆగోలు వెంకటరమణ సోమవారం మృతి చెందారు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించింది. దీంతో రూ.లక్ష మంజూరైంది. ఇందులో భాగంగా తక్షణ సహాయం కింద సచివాలయం సిబ్బందితో కలసి కార్పొరేటర్ కెల్ల సునీత బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ కొండవాలు ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ ఆరిలోవ ఎస్ఎస్ 11 కేవీ పరిధిలో మరమ్మతు పనులు జరగనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగదిలి, సాలిపేట, ఎస్సీ కాలనీ, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై అవగాహన

ఎంవీపీ కాలనీ: అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు బాలవికాష్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం(ఐఏఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు బుధవారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఈ సమావేశాలు జరగనున్నాయని ప్రతినిధులు తెలిపారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న వైద్యాధికారి అనిత

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రి(ఎఫ్ఆర్‌యూ), డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ) పరిధిలో ఉన్న క్షయ బాధితులకు బుధవారం పౌష్టికాహారం అందజేశారు. ఎఫ్ఆర్‌యూలో వైద్యాధికారి డాక్టర్ అనిత, బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురం, ఆదర్శనగర్ యూపీహెచ్‌సీల వైద్యాధికారులు ఆయా పరిధిలో ఉన్న బాధితులకు పౌష్టిక ఆహారంతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీ విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకులు, వేద పండితులు అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారా.. బయటకు చెప్పుకోలేక మీలో మీరు మదన పడుతున్నారా.. మీ సమస్యను నేరుగా వైద్యునికి తెలియజేయాలని ఉందా?.. ఇంకెందుకు ఆలస్యం వెంటనే 0891-3100189, 0891-3100048 నంబర్లకు ఫోన్ చేయండి. సుశిక్షితులైన వైద్యులు మీ సమస్యకు తగిన సూచనలు, సలహాలు, అవసరమైన చికిత్స అందిస్తారు.

మానసిక సమస్యా.. మదనపడొద్దు



టెలిమానస్ కేంద్రంలో సేవలు అందిస్తున్న వైద్యులు

- ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో టెలిమానస్ సేవలు ప్రారంభం
- బాధితులకు ఫోన్‌లో కౌన్సెలింగ్
- ఆత్మహత్యల నివారణే లక్ష్యం

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో టెలి మానస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. బుధవారం నుంచి ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో నలుగురు వైద్యులు ఫోన్‌లో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన కౌన్సెలింగ్ సేవలు అందించే వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. మానసిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆచార్య పి.లోకేశ్వరరెడ్డి, డి.విజయలక్ష్మి, డి.సురేష్‌కుమార్ ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రస్తుతం టెలిమెడిసన్ బాగా ప్రాచుర్యం పొందింది. ఇదే తరహాలో టెలి మానస్ సైతం నిలుస్తుంది. ఈ సందర్భంగా టెలి మానస్ పనిచేసే విధానాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామరెడ్డి వివరించారు.

బాధితులకు వరం

మానసిక సమస్యలు ఉన్నవారు త్వరగా వైద్యుల వద్దకు రావడానికి ఇష్టపడరు. తమ సమస్యలను ఇతరులతో పంచుకోవడానికి ఆసక్తి చూపరు. తమలో తాము మదన పడుతూ, మానసికంగా మరింత కుంగుబాటుకు లోనవుతారు. దీనికి పరిష్కారం చూపే విధంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న టెలి మానస్ నిలుస్తుంది. ఇందు కోసం ఆస్పత్రి మొదటి అంతస్తులో ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేశారు. ఇక్కడ నాలుగు ఫోన్లను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం నలుగురు వైద్యులు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదివారం మినహా వారంలో ఆరు రోజులు ఇక్కడ ఫోన్‌లో వైద్యులు అందుబాటులో ఉంటారు.

మనోస్థైర్యం నింపి.. ఆత్మహత్యల నివారణ

ఇటీవల కాలంలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్ కారణంగా క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య పెరుగుతోంది. ఇటువంటి వారికి మనోస్థైర్యాన్ని నింపి, ఆత్మహత్య నివారించే విధంగా ఈ కేంద్రం సేవలు అందిస్తుంది. ఎటువంటి మానసిక సమస్యలు ఉన్నవారైనా స్వేచ్ఛగా ఇక్కడికి ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా వైద్యులకు చెప్పుకునే అవకాశం ఉంది. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. ముందుగా రోగి ఆరోగ్య పరిస్థితి, మానసిక ఆరోగ్యం ఎలా ఉంది అనే వివరాలు తెలుసుకుంటారు. వీటిని ఆధారంగా చేసుకుని ఫోన్‌లో రోగికి అవసరమైన మానసిక ధైర్యాన్ని అందించి, చికిత్సకు వచ్చే విధంగా సిద్ధం చేస్తారు. అవసరమైతేనే రోగిని ఆస్పత్రికి రావాలని సూచించి, వారికి అవసరమైన సంపూర్ణ చికిత్స అందిస్తారు.



టెలి మానస్ కేంద్రం ప్రారంభిస్తున్న ఆచార్య లోకేశ్వర్‌రెడ్డి

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



అందుబాటులో ఉన్న వనరులు, వసతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తు న్నాం. మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారు నేరు గా ఆయా నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యను చెప్పుకోవచ్చు. సుశిక్షితులైన వైద్యులే స్వయంగా ఫోన్‌లో అందుబాటులో ఉండటంతో నేరుగా రోగి తన సమస్యను చెప్పుకునే అవకాశం ఉంది. నేరుగా వైద్యుని వద్దకు వెళ్లకుండా అవసరమైన కౌన్సెలింగ్ లభిస్తుంది.

– డాక్టర్ కె.వి.రామిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

సచివాలయ సేవలు విస్తృతం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ డైరెక్టర్ కోటేశ్వరరావు

మద్రిపాలెం: సచివాలయం సేవలను మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ నగర్ సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, యూజర్ చార్జీల వసూళ్లు, ఇంటింటికీ చెత్త సేకరణ, స్పందన ఫిర్యాదులు, తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సచివాలయంలో పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్ట్

సీతమ్మధార: భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 45వ వార్డు గురునాథ్ కాలనీలో అల్లు రాము, శారదా దంపతులు నివసిస్తున్నారు. వీరికి 2016లో వివాహమైంది. పాప, బాబు ఉన్నారు. రాము నావెల్ డాక్‌యార్డులో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యాడు. దీంతో కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2022 డిసెంబర్‌లో రాముపై భార్య శారదా ఫిర్యాదు మేరకు 498ఏ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం మద్యం కోసం రాము డబ్బులు అడగటంతో శారదా లేవని చెప్పింది. దీంతో పక్కనే ఉన్న కత్తితో ఆమెను గాయపర్చాడు. స్థానికులు ఆమెను 108లో ఆస్పత్రికి తరలించారు. శారదా ఫిర్యాదు మేరకు రామును పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ గౌరి కేసు నమోదు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ పైపులైన్‌కు మరమ్మతులు

మద్దిలపాలెం : జీవీఎంసీకి చెందిన ప్రధాన మంచినీటి పైపులైన్ శివాజీపాలెం రోడ్డు వద్ద పాడైపోయింది. దీంతో రెండు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నారు. పైపులు బాగా దెబ్బతినడంతో పైపులైన్ సామగ్రిని మార్చుతున్నారు. ఈ పనులు మరో రెండు, మూడు రోజుల్లో పూర్తవుతాయని సిబ్బంది తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టారు.



పైపులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఇది రోడ్డా.. పార్కింగ్ స్థలమా?



శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారిపై నిలిపిన ప్రైవేట్ బస్సులు

ఆరిలోవ: స్థానిక శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారి ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు నిలయంగా మారింది. దీంతో ఈ రోడ్డు బస్ స్టాండ్‌ను తలపిస్తోంది. ఇక్కడ నివాసాల సమీపంలో రోడ్డుపై ప్రతిరోజూ వరుసగా నిత్యం 10 నుంచి 15 బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డు మొత్తం బస్సులతో నిండిపోవడంతో మిగతా వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. చినగదిలి, అంబేడ్కర్ నగర్ నుంచి ఈ రోడ్డుపై శ్రీకాంత్‌నగర్, ఆరిలోవ కాలనీ, ముడసర్లోవ వైపు వెళ్లే వాహనచోదకులకు మరింత ఇబ్బందిగా మారింది. ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లు రాత్రివేళ వీటిని ఇక్కడికి తీసుకొచ్చి నిలిపేసి, మరుసటి రోజు తీసుకెళ్తున్నారు. కొన్ని బస్సులు రోజుల తరబడి ఉంటున్నాయి. మూడేళ్ల క్రితం ఓ రోజు ఉదయం ఇక్కడ ఓ బస్సు బయలుదేరుతున్న సమయంలో టర్న్ చేస్తుండగా వెనుక ఉన్న ఓ వృద్ధురాలిని ఢీకొంది. దీంతో ఆ వృద్ధురాలు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఆరిలోవ పోలీసులు స్పందించి ఈ బస్సులను నివాసాలకు దూరంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా కాలువ పైకప్పు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం ప్రధాన రహదారిలో షిర్డీసాయి మందిరం పక్కగా కాలువ పైకప్పు ప్రమాదాలకు నిలయంగా మారింది. కాలువ పైకప్పు రోడ్డుకు కిందకి కూరుకుపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా గోతులో పడి ద్విచక్ర వాహన చోదకులు గాయలపాలయ్యే అవకాశం ఉంది. తక్షణమే మరమ్మతులు చేపట్టి, కాలువ పైకప్పు ఎత్తు పెంచాలి.

– పి.నాగేశ్వరరావు, శివాజీపాలెం



శివాజీపాలెం షిర్డీసాయి మందిరం పక్కన గోతులో ఉన్న కాలువ పైకప్పు

‘ఫ్యామిలీ ఫిజీషియన్’ ప్రోగ్రాంపై సర్వే

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ ప్రోగ్రాంపై ఆంధ్ర వైద్య కళాశాల సామాజిక సేవా విభాగం భీమిలి మండలం తాటితూరులో మూడు రోజుల పాటు సర్వేను బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి రక్తపోటు, మధుమేహం, ఇతర ఆరోగ్య సమస్యలపై తనిఖీలు, అవగాహన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి, ప్రొఫెసర్ డాక్టర్ రాధాకుమారి, 25 మంది మెడికోలు, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, బి.శోభారాణి, సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, శిరిగుడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తాటితూరు చేరుకున్న ఆంధ్ర వైద్య కళాశాల సామాజిక సేవా విభాగం వైద్యులు

కక్షిదారులకు ఉచితంగా న్యాయ సహాయం

విశాఖ లీగల్ : కక్షిదారులకు న్యాయసహాయం ఉచితంగా అందించడమే న్యాయ సేవా సంస్థ లక్ష్యమని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎస్.వి.శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సంస్థ ప్రాంగణంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించే న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాధితులకు ఆన్‌లైన్ యాప్‌లో సంప్రదిస్తే వారికి తగిన విధంగా సహాయం అందించాలని కోరారు. ప్రతి న్యాయవాది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు అందుబాటులో ఉన్న ఫిర్యాదులను స్వీకరించి న్యాయ సహాయం అందించాలని కోరారు. కక్షిదారులు యాప్ ద్వారా ఫిర్యాదులు పంపిస్తే తక్షణం స్పందిస్తామన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కక్షిదారులు ఉచిత న్యాయసహాయం కోసం ఆన్‌లైన్ సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు



ప్రసంగిస్తున్న ఎస్.వి.శేషమ్మ

జోన్ - 2లో 87.62 శాతం పింఛన్ల పంపిణీ

మధురవాడ: జీవీఎంసీ జోన్ - 2 పరిధిలోని భీమిలి, విశాఖ తూర్పు నియోజకవర్గాల్లో గల 5 నుంచి 13వ వార్డు వరకు సోమ, మంగళవారాల్లో 87.62 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. పంపిణీ పనులను యూసీడీ ఏపీడీ గంగాధర్ పర్యవేక్షించారు. జోన్‌లో మొత్తంగా 19,371 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉండగా 16,973 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో 76వ నంబరు సచివాలయం పరిధిలో 107 బ్లాక్‌లో బి.మంగమ్మ అనే వృద్ధురాలికి వలంటీర్ భార్గవి, సచివాలయ కన్వీనర్ కల్లేపల్లి శంకరరావు, గృహ సారథులు సూర్యనారాయణ, మహేష్ పింఛన్ నగదు అందించారు.



మారికవలస ఆర్‌జీకే కాలనీలో పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్

వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మణుడు సహిత సీతారాములు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు బుధవారం ముగిశా యి. ఇందులో భాగంగా బుధవారం అష్టోత్తర కలశాభిషేకం, పుష్పయాగం కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగా యి. అనంతరం సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

‘గోబడ్డి’తో ఉద్యోగ అవకాశాలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: గోబడ్డి యాప్ ద్వారా నిరుద్యోగులకు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పంచాడ నరసింహారావు, రాజు గౌడ్ తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం రాజుగౌడ్ మాట్లాడుతూ గోబడ్డి యాప్ ద్వారా ప్లంబర్, కార్పెంటర్, పెయింటర్, ఎలక్ట్రిషియన్, ఏసీ మెకానిక్, డ్రైవర్స్ వంటి సేవలు అందిస్తోందన్నారు. విశాఖతో పాటు అనకాపల్లి, కాకినాడ, విజయనగరం జిల్లాలకు సేవలను విస్తరించినట్లు తెలిపారు.

మందుబాబులకు రూ.76వేల జరిమానా

సింహాచలం: పెందుర్తి ట్రాఫిక్ పోలిస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 25 మంది వాహనదారులను బుధవారం కోర్టులో ప్రవేశపెట్టగా వారికి మెజిస్ట్రేట్ రూ.76 వేలు జరిమానా విధించారని ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపారు. చినముషిడివాడ, నాయుడుతోట, వేపగుంట, నరవ తదితర ముఖ్య కూడళ్లలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 25 మంది మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏయూ సమాచారం..

భావ నైపుణ్యాలు ప్రధానం



చంద్రమోహన్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించే విద్యార్థులు భావ నైపుణ్యాలు కలిగి ఉండాలని తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య ఎ.చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రాంగణంలో ‘విజయవంతమైన పారిశ్రామికవేత్తలు, నాయకులు లక్షణాలు’ అంశంపై ఆయన మాట్లాడారు. వ్యక్తి విజయాల్లో కమ్యూనికేషన్ అనేది ఎంతో ముఖ్య భూమిక పోషిస్తుందని చెప్పారు. నాయకుడిగా, పారిశ్రామికవేత్తగా ఎదగడానికి భావ ప్రసార నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. వినడం, మాట్లాడటం, రాయడం ఈ మూడు లక్షణాలు నాయకత్వానికి మూల స్తంభాలుగా నిలుస్తాయని, వీటిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సారబంది, ఆచార్య కె.కె.చాంద్ కోలవెన్ను, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆచార్య చంద్రమోహన్‌ను సత్కరించారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను వర్సిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు బుధవారం పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న బీఈడీ పరీక్షలను స్వయంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆర్ట్స్ కళాశాలలోని విభాగాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, తరగతులు జరుగుతున్న విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేటలోని తన ఇంటి వద్ద బుధవారం ఉదయం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో సుమారు నాలుగున్నర లక్షల మంది శెట్టి బలిజలు ఉన్నారని, వారందర్నీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేలా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. శెట్టిబలిజ సంఘం నాయకుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులు, ఉన్నత హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వైద్యాధికారులు కడలి సత్యవరప్రసాద్, కముజు నరసింహరెడ్డి, యాండ్ర రాంప్రసాద్, యాండ్ర లక్ష్మీ నరసింగరావు, చెల్లుబోయిన మంగ వెంకట్‌లను సత్కరిస్తామన్నారు. నగరంలోని శెట్టి బలిజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కడలి సుబ్బారావు, కేతా గంగరాజు, కడలి శివ కేశవ నరసింహారావు, వాసర్ల బాలకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, నరాల బాలకృష్ణ, గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల రాజశేఖర్, కట్టా శ్రీకాంత్, మామిడిశెట్టి రామకృష్ణమూర్తి, రాయుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి. లేదా endow-eokanaka@gov. in ద్వారా పంపవచ్చు.